క్లుప్తంగా

సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ చంద్రశేఖర్

చీమకుర్తి: పేర్నమిట్టలోని ఒంగోలు 40వ డివిజన్‌లో పాలకేంద్రం సమీపంలో రూ.8 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి స్థానిక కార్పొరేటర్ తేళ్ల చంద్రశేఖర్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. కొన్ని సంవత్సరాలుగా ఈ రోడ్డు అధ్వానంగా ఉండటంతో స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు సిమెంట్ రోడ్డు నిర్మిస్తున్నట్లు చంద్రశేఖర్ తెలిపారు.

జర్దోసి మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ

ఒంగోలు సెంట్రల్: రూడ్‌సెట్ సంస్థలో మహిళలకు ఈనెల 18 నుంచి జర్దోసి మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ ప్రతాప్ రెడ్డి తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగిన మహిళలు అర్హులని చెప్పారు. రేషన్‌కార్డు, ఆధార్ కార్డు ఉండాలని, శిక్షణ కాలంలో భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తారన్నారు. పూర్తి వివరాలకు 9492583484ను సంప్రదించాలని కోరారు.

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ ఉపాధ్యక్షునిగా రామారావు

ఒంగోలు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ ఉపాధ్యక్షునిగా జిల్లా ఉపాధ్యక్షునిగా ఉన్న కొప్పోలు రామారావును ఎన్నుకున్నారు. గురువారం గుంటూరులోని రాష్ట్ర అసోసియేషన్ కార్యాలయంలో రాష్ట్ర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షునిగా డి.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా జి.ప్రభుదాసు, కోశాధికారిగా శర్మ ఎన్నికయ్యారు. జిల్లా అసోసియేషన్ నుంచి రాష్ట్ర సెక్రటరీగా ఎన్నికైన రామారావుకు జిల్లా కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.

ఇంటింటికి కుళాయిల ఏర్పాటుకు భూమి పూజ



ఇంటింటికి కుళాయిల ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న రవీంద్రరెడ్డి, సునీత, గ్రామస్తులు

ఈతముక్కల (కొత్తపట్నం): జలజీవన్ మిషన్ ద్వారా మంజూరైన ఇంటింటికి కుళాయిల ఏర్పాటుకు శుక్రవారం జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, సర్పంచ్ మేడికొండ సునీత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వంశీకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్, గ్రామస్తులు టెంకాయలు కొట్టి భూమి పూజ చేశారు. ఈతముక్కల గ్రామ పంచాయతీ పరిధిలో రెడ్డిపాలెంలో భూమి పూజ చేశారు. రెడ్డిపాలేనికి రూ.18.5 లక్షలు, పల్లెపాలేనికి రూ.18.5 లక్షలు, ఈతముక్కలకు రూ.47.50 లక్షలు, చెంచుపాపాయిపాలేనికి రూ.18.5 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా రవీంద్రరెడ్డి మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి ఉచితంగా కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పైపులైన్లు వేయడానికి పొక్లెయిన్‌తో గుంతలు తీసే పని ప్రారంభించామని చెప్పారు. త్వరలో పూర్తి చేసి ప్రతి ఇంటికి కుళాయిలు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ తుమ్మా పుల్లయ్య, వయేటి సరసారెడ్డి, రెడ్డిపాలెం గ్రామస్తులు కృష్ణారెడ్డి, బక్క అయ్యప్పరెడ్డి, కాంట్రాక్టర్ రమణారెడ్డి పాల్గొన్నారు.

యానాది కాలనీకి కల్చరల్ మండపం నిర్మాణానికి భూమి పూజ...

ఈతముక్కల గ్రామం బుక్కసముద్రం యానాది కాలనీలో కల్చరల్ మండపం నిర్మాణానికి శుక్రవారం జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, సర్పంచ్ మేడికొండ సునీత, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్, స్థానికులు టెంకాయలు కొట్టి భూమి పూజ చేశారు. రవీంద్రరెడ్డి మాట్లాడుతూ ఎంపీ లాడ్స్ నుంచి రూ.9.5 లక్షలు మంజూరయ్యాయని, త్వరలో పని ప్రారంభిస్తామని అన్నారు.

ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే సహించం

- ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



నగరంలో పారిశుధ్యం, తాగునీరు సమస్యలపై నగరపాలకసంస్థ అధికారులు, ఉద్యోగులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు టౌన్: నగరపాలక సంస్థ పారిశుధ్య, నీటిసరఫరా విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు నగర ప్రజలకు ఇబ్బంది కలిగించకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని, ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం కార్పొరేషన్ కౌన్సిల్ హాలులో పారిశుధ్యం, మంచినీటి సరఫరాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బాలినేని ప్రసంగిస్తూ... నగరంలో పారిశుధ్య పనులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దోమలు పెరిగి జనాలు ఇబ్బంది పడుతుంటే ఫాగింగ్ చేయకుండా ఎందుకు చోద్యం చూస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. ఇది ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన విషయమని, ఏదైనా సమస్య వస్తే అప్పుడు ఎవరు బాధ్యత వహిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల నిర్వాహణలో సచివాలయ కార్యదర్శులకు, మేస్త్రీలకు తగిన స్వేచ్ఛ ఇచ్చామని, అయినా బాధ్యతగా వ్యవహరించకపోతే ఎలా అంటూ నిలదీశారు. నగరంలో పారిశుధ్యం విషయంలో కూడా సిబ్బంది నిర్లక్ష్యంగా ఉన్నారని, సక్రమంగా విధులు నిర్వహించని మేస్త్రీలను పనుల నుంచి తీసేయమని మేయర్‌కు సూచించారు. విధులకు సక్రమంగా హాజరుకాని వారికి హాజరు ఎందుకు వేస్తున్నారని అడిగారు. తాను స్వయంగా ఎవరినీ ఇబ్బంది పెట్టనని, అలాగని ప్రజలకు ఇబ్బంది పెడుతుంటే చూస్తూ ఊరుకోలేనంటూ హెచ్చరించారు. స్నేహపూరిత వాతావరణంలో బాధ్యతగా పనిచేస్తే ప్రజలు ఎందుకు ఫిర్యాదు చేస్తారని ప్రశ్నించారు. వార్డుల్లో చేసిన పనుల వివరాలను ఎప్పటికప్పుడు ఆయా కార్పొరేటర్ల మొబైల్ ఫోన్లలో మెసేజ్ పెట్టాల్సిందిగా సచివాలయ కార్యదర్శులు, మేస్త్రీలకు ఆదేశించారు. పారిశుధ్యం విషయంలో ఏదైనా అవసరం ఉంటే అడగాలని, ఎంత ఖర్చయినా సమకూరుస్తామన్నారు. కొన్ని పత్రికల్లో వచ్చే వార్తలను పట్టించుకోవద్దని, వారికి బుద్ధి వచ్చేలా గట్టిగా పనులు చేయాలని చెప్పారు. మీడియా బాధ్యతగా వార్తలు రాయాలని సూచించారు. వేసవి నేపథ్యంలో నగరంలోని ప్రజలకు మంచినీటి సమస్య తలెత్తకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రి పూట నీరు వదలకుండా వీలైనంత మేరకు పగలు మాత్రమే నీరు వదలాలన్నారు. రెండు రోజుకోసారి నీరు ఇస్తున్నారా లేదా అని ప్రశ్నించారు. మోటార్లు సరిగా పనిచేసేలా అంతా సంసిద్ధం చేసుకోవాలని, ఏ మాత్రం తేడా వచ్చినా ఒప్పుకోనంటూ స్పష్టం చేశారు. నగరాభివృద్ధికి మీరు కీలకమని, నగరాన్ని సుందరంగా, పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత మీదేనని నగరపాలక సంస్థ మేయర్ గంగాడ సుజాత చెప్పారు. నగరంలో పారిశుధ్యం గురించి ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. 60 ఆటోలు, 20 ట్రాక్టర్లు, పుష్కార్టులు పెట్టుకొని కూడా చెత్తను తీసేసే విషయంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, కార్పొరేటర్లు ఇమ్రాన్ ఖాన్, యనమల నాగరాజు, శాండిల్యా, గోపిచంద్, జడా వెంకటేష్, అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి 30 కుటుంబాలు



వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

- పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన మంత్రి మేరుగు నాగార్జున

చీమకుర్తి: సంతనూతలపాడు మండలం పేర్నమిట్టలోని ఒంగోలు 39వ డివిజన్‌లో టీడీపీ, జనసేన నుంచి 30 కుటుంబాలు శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరాయి. వారికి పార్టీ కండువాలు కప్పి మంత్రి మేరుగు నాగార్జున ఆహ్వానించారు. ఇదే కార్యక్రమంలో దాదాపు 2,500 మంది పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, ఎంపీపీ బీ విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, సొసైటీ ప్రెసిడెంట్ దుంపా యలమందారెడ్డి, సంతనూతలపాడు సర్పంచ్ దర్శి నాగమణి, పేర్నమిట్టలోని కౌన్సిలర్లు గోలి లక్ష్మీకోటేశ్వరమ్మ తిరుపతిరావు, నూకతోటి మస్తానమ్మ ఈశ్వరరావు, స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పేర్నమిట్టలోని ఒంగోలు 39వ డివిజన్‌లో పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత...

చీమకుర్తి మండలం చీమలమర్రి గ్రామానికి చెందిన జడ పిచ్చిబాబుకు శుక్రవారం సంతనూతలపాడులో రూ.55 వేల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మంత్రి మేరుగు నాగార్జున చేతుల మీదుగా అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న కారణంగా వైద్యచికిత్స నిమిత్తం ఈ చెక్కు అందించారు. కార్యక్రమంలో చీమకుర్తి సొసైటీ ప్రెసిడెంట్ జీ ఓబుల్‌రెడ్డి, జడ సుగుణరావు, పిచ్చియ్య, రాజు, కౌశిక్, మరియదాస్ పాల్గొన్నారు.

శచీదేవి ప్రచారానికి వెల్లువెత్తిన ప్రజాభిమానం



స్థానికులతో మాట్లాడుతున్న బాలినేని శచీదేవి, బాలినేని శ్రీకావ్య

ఒంగోలు: స్థానిక 46వ డివిజన్‌లో శుక్రవారం నిర్వహించిన మహిళలతో మమేకం–స్త్రీశక్తితో శచీదేవి కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సతీమణి బాలినేని శచీదేవి, వారి కోడలు శ్రీకావ్య పాల్గొని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వారికి స్థానికుల నుంచి అపూర్వ ఆదరణ లభించింది. ప్రతి చోటా జనం ఆప్యాయతలు కనబరిచారు. కరోనా సమయంలో వాసన్న ఎలా ఆదుకున్నారనే విషయాన్ని ప్రజలే వివరిస్తూ ఈ ఎన్నికల్లో ఆయనకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కరోనా సమయంలో తాము ఎలా ఉన్నామో.. ఏమయ్యామో కూడా పట్టించుకోని టీడీపీ నేతలు నేడు ఓట్ల కోసం వస్తుంటే అసహ్యం వేస్తోందన్నారు. ఈ సందర్భంగా పలు ఇళ్లలో హారతులిచ్చి మరీ శచీదేవి, శ్రీకావ్యకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శచీదేవి, శ్రీకావ్య మాట్లాడుతూ మంచి చేశాం కనుకే ఓటు వేయమని మిమ్మల్ని కోరగలుగుతున్నామన్నారు. అబద్ధాలు చెప్పాల్సిన అవసరం తమకు లేదన్నారు. వాస్తవాన్ని గమనించి ఫ్యాను గుర్తుపై ఓటేయమని కోరారు. ఈ ప్రాంతం మీదుగా వెళ్తున్న విద్యుత్ హైటెన్షన్ వైర్ల వల్ల గతంలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని, కానీ, వాసన్న విద్యుత్ శాఖామంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని గుర్తుచేశారు. రూ.56 కోట్లు వెచ్చించి భూగర్భ విద్యుత్ లైన్లు నిర్మించడం జరిగిందన్నారు. అంతకుముందు భవనం పైకి ఎక్కాలంటే ఏ క్షణాన ఏం జరుగుతుందో అనే భయంతో ఉండేవారిమని, కానీ నేడు ఆ పరిస్థితి లేదని, ఇదంతా వాసన్న చలువే అని స్థానికులు వెల్లడించారు. నిజంగా ఈ విషయంలో వాసన్న చూపిన చొరవను జీవితాంతం మరువలేమన్నారు. ఆ వైర్లు తొలగించడంతోనే తమ స్థలాల ధరలు కూడా గణనీయంగా పెరిగాయని, బాలినేని పట్టుబడితే సాధిస్తాడనేందుకు ఇదో ఉదాహరణ అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా వాసన్నను తప్పకుండా గెలిపించుకుంటామంటూ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు కొప్పెర్ల విజయభాస్కర్, 13వ డివిజన్ కార్పొరేటర్ కొప్పెర్ల కమల, నాయకులు కోటిరెడ్డి, కృష్ణారెడ్డి, భవాని, పోల వెంకట్రావు, సోమిశెట్టి నారాయణ, వేముల విజయభాస్కర్, ఆలీ, షరీఫ్, పాకాల లక్ష్మి, అళహరి పద్మావతి, నాగూర్, కార్పొరేటర్ కృష్ణలత, కోఆప్షన్ మెంబర్ రషీద, బలభద్రుని వెంకటేశ్వర్లు, మహిళా విభాగం జిల్లా, నగర అధ్యక్షులు తమ్మినేని మాధవి, చింతగుంట్ల సువర్ణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లీలాకుమారి, మాతాశిశు వైద్యశాల డైరెక్టర్ సాధం విజయలక్ష్మి, 36వ డివిజన్ అధ్యక్షుడు పిడపర్తి మధుసూదన్‌రెడ్డి, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ పేర్నమిట్ట రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల గురించి తెలుసుకోవాలి

- జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి ఉదయ భాస్కర్



సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

ఒంగోలు సెంట్రల్: ప్రతి వినియోగదారుడు తమ హక్కుల గురించి తెలుసుకోవాలని జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి ఉదయభాస్కర్ కోరారు. స్థానిక రైజ్ కృష్ణసాయి ఇంజినీరింగ్ కళాశాలలో స్టెప్, ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్తంగా శుక్రవారం ప్రపంచ వినియోగదారుల దినోత్సవం నిర్వహించాయి. కాలేజీ కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీపీసీటీ మాగులూరి నాగేశ్వరరావు, ఫుడ్ కంట్రోలర్ ఆఫీసర్ ప్రభాకర్, కళాశాల డైరెక్టర్ ఏవీ భాస్కర్‌రావు మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు, చట్టాలు, నష్టపోయినప్పుడు పరిహారం ఎలా పొందాలనే విషయాలను వివరించారు. విద్యార్థులు తెలుసుకుని వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు తెలపాలని కోరారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గ అమ్మవారికి వార్షిక మహాకుంభాభిషేకం



అగ్ని మదనంలో అర్చకులు

ఒంగోలు మెట్రో: స్థానిక కేశవస్వామిపేటలోని విజయదుర్గ అమ్మవారికి త్రయాహ్నిక దీక్ష వార్షిక మహా కుంభాభిషేకాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవస్థాన కార్యవర్గ సభ్యులు తాత కళ్యాణ్‌రావు, నల్లమల్లి సత్యనారాయణ, సభ్యుల నిర్వహణలో ఆలయ ప్రధాన అర్చకుడు వేద సాయి ఆధ్వర్యంలో ఉదయం ఆరు గంటలకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య, ప్రాసన, రక్షాబంధనం, దీక్షాధారణ నిర్వహించారు. ఏడు గంటలకు 108 కళాశాలతో సుహాసీనులచే రంగారాయుడు చెరువు వద్ద నుంచి జలసేకరణ, 108 సర్వతో భద్రమండల సహిత మండపారాధన, కలశ స్థాపన, హారతి తీర్థప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం ఆరు గంటలకు గణపతి హోమం, లక్ష్మీగణపతి హోమం, బాలాత్రిపురసుందరి ఆవాహన పూజ నిర్వహించారు. రాత్రికి మంత్రపుష్పం, హారతి, తీర్థ ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి దీవెనలు అందుకున్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరిక



బాలినేని సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరుతున్న నాయకులు

- పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే బాలినేని, యువనేత ప్రణీత్‌రెడ్డి

ఒంగోలు: తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షునిగా, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన నగరంలోని ఐదో డివిజన్‌కు చెందిన ఎర్రాకుల శ్రీనివాసులు యాదవ్, పెయ్యల మణికంఠ, చింతాడ రాంబాబు శుక్రవారం ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎర్రాకుల శ్రీనివాస యాదవ్ మాట్లాడుతూ దామచర్ల జనార్దన్ చేస్తున్న అరాచకాలకు పార్టీలో ఇమడలేక వైఎస్సార్ సీపీలో చేరినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఒంగోలు నగర అధ్యక్షుడు కటారి శంకర్రావు, ఎండేటి రంగారావు, బొమ్మినేని మురళి, ఎండేటి వెంకట్రావు, కటారి సురేష్, కొల్లూరు శ్రీనివాసరావు, బొట్ల సుబ్బారావు, పల్లపోతుల మోహన్ రావు, గంగాడి అనిల్ కుమార్, చాపల హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా టీడీపీ నుంచి మరికొందరు నాయకులు వైఎస్సార్ సీపీలో చేరగా, వారికి వైఎస్సార్ సీపీ యువనాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. స్థానిక 3వ డివిజన్‌కు చెందిన టీడీపీ బూత్ కమిటీ అధ్యక్షులు వియ్యాల దుర్గాప్రసాద్, వియ్యాల నాని ఆధ్వర్యంలో 25 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. 21వ డివిజన్‌కు చెందిన కొడవటి ప్రవీణ్‌కు ఉదయం టీడీపీ నాయకులు కండువా కప్పి ఆహ్వానించగా, మధ్యాహ్నానికే ఆయన మనసు మార్చుకుని మళ్లీ ప్రణీత్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ప్రణీత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాయని, ప్రతి కుటుంబంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని తెలిపారు. 2019 కంటే ఈ దఫా మరింత భారీ మెజార్టీతో విజయాన్ని కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ప్రతి వైఎస్సార్ సీపీ నాయకుడు, కార్యకర్త కృషిచేయాల్సిన అవసరాన్ని వివరించారు. మంచి చేశాం కనుక ధైర్యంగా ఓట్లు అడగగలమని అన్నారు. కానీ, గతంలో మంచి చేయకుండా మళ్లీ తాము వస్తే మంచి చేస్తామని చెప్పే టీడీపీ నాయకుల మాటలు నమ్మి ప్రజలు మోసపోకుండా చైతన్యం కల్పించడమే మన పని అంటూ దిశా నిర్దేశం చేశారు. టీడీపీ నాయకులు తీవ్రమైన ఒత్తిడి తెచ్చి కండువాలు కప్పుతుంటే గంటల వ్యవధిలోనే వారు అందులో ఇమడలేక తిరిగి సొంత గూటికి చేరుకుంటున్న విషయాన్ని గమనించాలన్నారు. 3వ డివిజన్ టీడీపీ పోలింగ్ బూత్ కమిటీ సభ్యునిగా ఉన్న దుర్గాప్రసాద్ మాట్లాడుతూ టీడీపీ పోలింగ్ బూత్ కమిటీ సభ్యులుగా తాము ఆ పార్టీ నాయకుని దృష్టికి సమస్యలు తీసుకెళ్లినా పరిష్కరించేందుకు చొరవ చూపడం లేదన్నారు. పార్టీ నుంచి కనీస గుర్తింపు కూడా కొరవవడం బాధ కలిగించిందన్నారు. అందువల్లే టీడీపీకి రాజీనామా చేసి గందు మధు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరడం జరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో 3వ డివిజన్ వైఎస్సార్ సీపీ అడ్డా అని నిరూపిస్తామన్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ గందు ధనలక్ష్మి, మధు, శ్రీకాంత్‌రెడ్డి, నాయక్, మాజీ కౌన్సిలర్ పసుపులేటి శ్రీనివాసరావు, దూళిపూడి ప్రసాద్‌నాయుడు, నితిన్, పసుమర్తి గోపి, మధుబాబు, పురిణి శ్రీకాంత్, హేమంత్, శైలజ, శ్రీను, రవి, శ్యామ్, సుధీర్, మణి, వెంకట్రామయ్య, పిచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరుతున్న వారికి పార్టీ కండువాలు వేస్తున్న యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి

స్విగ్గీ బృందానికి బాలినేని ప్రణీత్ అభయం...

స్విగ్గీ రైడర్స్ బృందానికి బాలినేని ప్రణీత్‌రెడ్డి అభయమిచ్చారు. శుక్రవారం వారు ప్రణీత్‌రెడ్డిని కలుసుకుని తమ సమస్యలు వివరించారు. తమకు విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు పరిష్కరించేందుకు చొరవ చూపాలని కోరారు. వాటిని సావధానంగా విన్న ప్రణీత్‌రెడ్డి.. తప్పకుండా పరిష్కరిస్తానని హామీ ఇవ్వగా, తాము కూడా పార్టీలో చేరతామని వారు ముందుకొచ్చారు. తాము 200 మంది ఉన్నామని, ఇప్పటివరకు తమ యూనియన్ ప్రతినిధులు ప్రత్యేకంగా ఏ యూనియన్‌లో చేరలేదని, మీతో మాట్లాడిన సందర్భంలో మీరు చూపించిన ఆప్యాయతతో వైఎస్సార్ సీపీలో చేరాలని నిర్ణయించుకున్నామని వివరించారు. యూనియన్ లీడర్లు గోపీచంద్, మధు, మారుతి, చిరంజీవి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సృజన ఫెస్ట్ 2కే 24 వేడుకలు ప్రారంభం



మాట్లాడుతున్న పేస్ కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో సృజన ఫెస్ట్ 2కే 24 టెక్నికల్ వేడుకలను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ ఇంజినీరింగ్ కాలేజీల నుంచి దాదాపు 1500 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరు పేపర్ ప్రజెంటేషన్, టెక్నికల్ క్విజ్, ప్రాజెక్టు ఎక్స్‌పో మొదలైన పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపారు. కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలు, భావ వ్యక్తీకరణ, సృజనాత్మకతలను వెలికితీసేందుకు ఫెస్ట్ దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, ఏవో ఎం.రమణబాబు, డీన్ ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ కె.రూప అక్కేష్ తదితరులు పాల్గొన్నారు. వివిధ విభాగాల అధిపతులు ప్రత్యేక బాధ్యతలు తీసుకుని ఫెస్ట్‌ను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

వైఎస్సార్ సీపీ యూత్ మండల అధ్యక్షునిగా రామిరెడ్డి



రామిరెడ్డికి నియామకపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

కొత్తపట్నం: వైఎస్సార్ సీపీ యూత్ కొత్తపట్నం మండల అధ్యక్షునిగా ములకా రామిరెడ్డిని నియమిస్తూ మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఒంగోలులోని బాలినేని నివాసంలో నియామకపత్రం అందజేశారు. కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి సమక్షంలో నియామక పత్రం అందజేసిన బాలినేని మాట్లాడుతూ కొత్తపట్నం మండలంలోని యువతను ఏకం చేసి వారి సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించాలన్నారు. తద్వారా ఎన్నికల్లో యువతను వైఎస్సార్ సీపీలో భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ప్రతి ఇంటి ముంగిటకి ప్రభుత్వ పథకాలు
- వాసన్నను గెలిపించేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలి
- 50వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి



50వ డివిజన్‌లో మాట్లాడుతున్న బాలినేని ప్రణీత్‌రెడ్డి

ఒంగోలు: ప్రజల సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఆ పార్టీ యువనాయకుడు బాలినేని ప్రణీత్ రెడ్డి అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక 50వ డివిజన్‌లో సంచార జాతి ప్రజానీకం ఎక్కువగా నివాసం ఉండే కాలనీలో ఆంజనేయస్వామి, పోలేరమ్మ తల్లి ఆలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికులు పెదాల రమేష్, ప్రతాపు సాయిలు ప్రణీత్‌రెడ్డిని ఆహ్వానించి సత్కరించారు. ఆలయ నిర్మాణానికి సహకరించాలని ప్రణీత్‌రెడ్డిని వారు కోరారు. తప్పక సాయం చేస్తానని ప్రణీత్‌రెడ్డి హామీ ఇచ్చారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ప్రణీత్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ఊర చెరువు వద్ద సంచార జాతుల వారికి చెందిన ఇళ్లను ధ్వంసం చేసింది ఎవరో తెలుసుకోవాలన్నారు. అటువంటి టీడీపీ వారికి ఓట్లు వేసి ప్రమాదాన్ని కొని తెచ్చుకుంటారా..? అని ప్రశ్నించారు. దానికి జనం మొత్తం ముక్తకంఠంతో టీడీపీకి ఓట్లు వేసేదే లేదంటూ స్పష్టం చేశారు. ప్రణీత్‌రెడ్డి మాట్లాడుతూ మీకు సంక్షేమ పథకాలు పొందేందుకు ఆధార్ కార్డులు కూడా లేక ఇబ్బంది పడుతుంటే మీకు ఒక చిరునామా ఏర్పాటు చేసి అందరికీ ఆధార్‌కార్డులు ఇప్పించింది వాసన్న అనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఆ ఆధార్‌కార్డు, రేషన్ కార్డులు రాబట్టే నేడు నేరుగా మీ ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు వస్తున్నాయని, ఆ విషయం మరువరాదని కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకం ఏదైనా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతుందన్నారు. ఇంకా ఎవరికైనా ఇంటి పట్టాలు రాకుండా కొత్తగా దరఖాస్తు చేసుకుని ఉంటే రెండో జాబితాలో పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని, 90 రోజుల్లోగా ఇంటి పట్టా ఇప్పించే బాధ్యత తనదని అన్నారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి కావాటి రవికుమార్ అధ్యక్షత వహించగా, కార్పొరేటర్ అంబటి ప్రసాదరావు, వైఖానస సంఘ జిల్లా అధ్యక్షుడు పరాంకుశం కేశవాచార్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు బాకా రమేష్‌రెడ్డి, బాకా శివారెడ్డి, బేతపూడి రాజేశ్వరి, భాస్కర్, సూర్యబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి కరుణాకర్, ముల్లంగి రవీంద్రారెడ్డి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

నారాయణలో జిల్లా స్థాయి స్పెల్ బీ కాంపిటేషన్

ఒంగోలు సెంట్రల్: స్థానిక నారాయణ ఒలంపియాడ్ స్కూల్లో శుక్రవారం జిల్లా స్థాయి స్పెల్ బీ కాంపిటేషన్ నిర్వహించారు. జిల్లాలోని నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు విద్యాసంస్థల ఏజీఎం పెద్దిరెడ్డి బహుమతులు అందించారు. హైస్కూల్స్ హెడ్ రాజేష్, స్కిల్స్ హెచ్‌ఓడీ సాధిక్, జిల్లా కోఆర్డినేటర్ శరత్‌బాబు, ఆర్ఐ మన్నం శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ వేదవతి, సయ్యద్ నాగూర్‌వలి, అభిషేకం, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎంపీడీవోగా బండి శ్రీనివాసరావు

ఒంగోలు రూరల్: ఒంగోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బండి శ్రీనివాసరావు శుక్రవారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఎంపీడీవోగా పనిచేస్తున్న ఏవో శ్రీనివాసరెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఆయనను పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



ఎంపీడీవోకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏవో, ఈవోఆర్డీ, సచివాలయ కార్యదర్శులు

మహబూబ్‌కు పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం



మహబూబ్‌జాన్

ఒంగోలు టౌన్: ఒంగోలుకు చెందిన ప్రముఖ రచయిత షేక్ మహబూబ్‌జాన్‌కు పొట్టి శ్రీరాములు విశ్వ విద్యాలయం ప్రతిష్టాత్మక కీర్తి పురస్కారం లభించింది. బాల సాహిత్యంలో విశేషమైన కృషి చేస్తున్న మహబూబ్ జాన్‌ను 2022 కీర్తి పురస్కారానికి ఎంపిక చేసినట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ నుంచి సమాచారం వచ్చింది. ఈ నెల 20వ తేదీ హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ కళా ప్రాంగాణం వేదికపై జరుగనున్న కార్యక్రమంలో పురస్కారం అందించనున్నారు. పురస్కారంతో పాటు రూ.5,116 నగదు పారితోషికాన్ని కూడా అందించనున్నారు. ప్రతిష్టాత్మకమైన పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం నుంచి కీర్తి పురస్కారానికి ఎంపికైన మహబూబ్‌జాన్‌ను ప్రకాశం జిల్లా రచయిత సంఘం అధ్యక్షుడు పాన్నూరు శ్రీనివాసరావు, ఎంఏ సాలార్, షేక్ జబ్బార్, పాత్తూరి బదరి తదితరులు అభినందించారు.

రమేష్‌కృష్ణకు...

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో వివిధ కళారంగాలలో విశేష ప్రతిభ కనబరిచిన ఉభయ తెలుగురాష్ట్రాల వారికి కీర్తి పురస్కారాలు ప్రదానం చేస్తున్నట్లు తెలుగు విశ్వవిద్యాలయ నిర్వాహకులు తెలిపారు. ప్రకాశం జిల్లా ఒంగోలువాసి డాక్టర్ రమేష్‌కృష్ణకు ఆంధ్రనాట్యంలో చేసిన కృషికి కీర్తి పురస్కారం ప్రదానం చేస్తున్నట్లు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కిషన్‌రావు తెలిపారు. ఈ నెల 21వ తేదీ హైదరాబాద్‌లోని తెలుగు లలిత కళాతోరణంలో ఒక ప్రత్యేక కార్యక్రమంలో పురస్కారం ప్రదానం చేయనున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ పేర్కొన్నారు.